క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీ, హసుమాన్‌నగర్, ఎన్‌ఐఆర్‌డి, ఎమ్మార్వో ఆఫీస్ తదితర ప్రాంతాల్లో, గ్రేహౌన్స్ ఫీడర్‌లో రాజేంద్రనగర్, ఐసీఎం ట్రెనింగ్ సెంటర్, నార్మ్, మెనేజ్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు ఓటరు నమోదు కార్యక్రమం

మణికొండ: ఓటరు నమోదు కార్యక్రమం బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించనున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. స్థానికంగా ఓటు హక్కు లేని వారు, ఓటరు లిస్టులో తప్పులు ఉన్న వారు, 18 సంవత్సరాల వయసు పూర్తయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

రాయదుర్గం: ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్త నవీన్ తండ్రి త్రినాథ్‌ను మంగళవారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పరామర్శించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ వద్ద కారు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఆయనకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లితండా వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డెర శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు నమోదు ప్రక్రియ

- డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియ చురుకుగా సాగుతోందని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది కొత్తగా ఓటరు నమోదు, అడ్రస్‌ల మార్పులపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. అందులో భాగంగా మంగళవారం ఫారం–6 కింద కొత్తగా ఓటరు నమోదు కోసం 186 దరఖాస్తులు రాగా, ఫారం–8 కింద అడ్రస్‌లు, పేర్లు, ఇతర మార్పుల గురించి 108 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలలో ప్రత్యేక ప్రక్రియను ప్రారంభించామన్నారు.

సన్మానం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిని దివ్యాంగుల సంఘం అధ్యక్షులు మేకల అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అనంతరం దివ్యాంగుల సమస్యలను వివరించారు. అదే విధంగా డబుల్‌బెడ్ ఇళ్ల కేటాయింపులో 5 శాతం మంజూరుతోపాటు అర్హులైన వారందరికి వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఫకీర్ సాబ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, ప్రతినిధులు ఉర్మిళ, సాయిబాబు, మధు, ముక్తార్, కుమార్, రషీద్ పాల్గొన్నారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లీస్ పార్టీ పక్కా సెక్యులర్ పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఉదయం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఆయనకు వివరించుకున్నారు. తాగునీటి కొరత తీవ్రంగా ఉందని ఎండీ లైన్స్‌కు చెందిన పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతంలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుందని మరికొందరు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొన్ని సమస్యలు సీజన్‌లో తలెత్తుతాయని వాటిలో డ్రైనేజీలు పొంగిపొర్లడం ఒకటని ఆయన అన్నారు. భారీగా కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లిన మాట వాస్తవమేనని అయితే జలమండలి అధికారులను వెంటనే రంగంలోకి దించి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. లో ప్రెజర్ ఉన్న సమస్యల ప్రాంతాల్లో బూస్టర్లు బిగించి తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నానని ఆయన అన్నారు.

గుడిమల్కాపూర్‌లో అభివృద్ధి పనులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం ఆయన జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో పర్యటించారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలను పరిశీలించారు.

రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కోకాపేట్ భూములను వేలం వేసిన ప్రభుత్వం రూ.5,500 కోట్లు ఆర్జించిందని, ఆ మొత్తంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని కోరారు. మంగళవారం కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీష్‌రావు తదితరులు రాష్ట్రంలో భూముల వేలాన్ని ఆపాలంటూ ఆందోళన నిర్వహించారని గుర్తు చేశారు. నేడు ప్రభుత్వాన్ని నడపడం చేతకాక భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని భూములను ఇష్టానుసారం అమ్ముతున్న ఎమ్మెల్యే ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. కోకాపేట్ భూములను వేలం వేయడం ద్వారా రూ.5,500 కోట్లు వచ్చాయని ఆ డబ్బును ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు దారి మళ్లిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి వెంటనే రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలన్నారు. నిధులను రాబట్టడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. కమీషన్లకు అలవాటుపడ్డ ఎమ్మెల్యేకు భూముల అమ్మకంలో ఎంత వచ్చింతో బహిరంగంగా వెల్లడించాలన్నారు. బుద్వేల్ భూములను సైతం అమ్మేందుకు సిద్ధమయ్యారని వేలాన్ని వెంటనే ఆపాలన్నారు. కోకాపేట్‌లో వంద కోట్లకు ఎకరం పోయిందని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రభుత్వ భూములు ఎంతో అవసరమన్నారు. విలువైన భూములను అమ్ముకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వం బుద్వేల్ భూముల పక్కనే హనుమాన్‌నగర్‌లో 50 ఏళ్లుగా ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ ప్రజలకు అన్యాయం జరుగుతుందని దానిని ప్రశ్నిస్తే తమను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్వేల్, కోకాపేట్ ప్రాంతంలోనే దాదాపు 600 ఎకరాల భూమిని అమ్మేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. బుద్వేల్ భూముల పరిశీలనకు వెళుతున్న తమను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, రావుల భాస్కర్, తలారి చిన్న, వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బబ్లు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని కార్మికులకే అప్పగించాలి



మంత్రిని కలిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యతను 'అక్షయ పాత్ర' ఫౌండేషన్‌కు అప్పగించడంతో ఎందరో కార్మికులు రోడ్డున పడ్డారని సీఐటీయు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజేంద్రనగర్, గండిపేట, మొయినాబాద్, శేరిలింగంపల్లి మండలాలకు చెందిన కార్మికులతో కలిసి ఆయన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యత కార్మికులకే అప్పగించాలని, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల బిల్లులు, ప్రభుత్వం పెంచిన రూ.3వేల వేతనం, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ప్రవీణ్, జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయు నాయకులు ఎల్లేష్, శేఖర్, శ్రీశైలం, గణేష్, సరిత, శిరీష, లక్ష్మీ, ఫాతిమా, పార్వతి, రంగమ్మ ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో వ్యాక్సినేషన్ చేయించాలి

జిల్లా వ్యాక్సినేషన్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణకుమారి



హైదర్షాకోట్‌లోని సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యాక్సినేషన్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణకుమారి

బండ్లగూడ: చిన్నారులకు తల్లిదండ్రులు సకాలంలో వ్యాక్సినేషన్ వేయించడంతో 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని రంగారెడ్డి జిల్లా వ్యాక్సినేషన్ అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి అన్నారు. మంగళవారం నార్సింగి రూరల్ హెల్త్ సెంటర్ పరిధిలోని హైదర్షాకోట్ ఆరోగ్య ఉప కేంద్రంలో 2023 మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ స్వర్ణకుమారి, నార్సింగి రూరల్ హెల్త్ సెంటర్ హెచ్ఈవో సాల్మన్‌రాజ్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాల్లో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేక కార్యక్రమం ద్వారా టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించేందుకు ఆశావర్కర్ల చేత ఇంటింటికి సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ సర్వేలో టీకాలు వేయించుకోని వారిని గుర్తించి వారందరికి ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలను వేయిస్తామన్నారు. మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైదర్షాకోట్ ఆరోగ్య ఉపకేంద్రం ఎంపీహెచ్ఏ అమృత, ఆశావర్కర్లు అరుణ, రమ తదితరులు పాల్గొన్నారు.

శాంతకుమార్ శర్మకు వేద వైదిక అర్చక రత్న అవార్డు



అవార్డు అందుకున్న శాంతకుమార్ శర్మ

మణికొండ: పుప్పాలగూడలోని శ్రీకాశీ విశ్వనాథ సమేత నల్లపోచమ్మ ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ శాంతకుమార్‌శర్మకు స్వాతంత్ర్య దినోత్సవం సువర్ణ కంకణ అవార్డు సంబరాలలో భాగంగా లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు వేద వైదిక అర్చక రత్న అవార్డుతో సత్కరించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కళా రంగాల్లో నిష్ణాతులైన 180 మందిని ఎంపిక చేసి అవార్డులను అందజేశారు.

భాగ్యనగర్ కాలనీలో మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ భాగ్యనగర్ కాలనీలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం దోహదపడుతుందన్నారు. మొక్కలను నాటి వాటిని పెంచాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్క వృక్షాలుగా ఎదిగేందుకు నీరు పోసి సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో టింకురెడ్డి, విశ్వనాథం, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న నాయకులు

బండ్లగూడ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని హిమాయత్‌సాగర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చేగూరిరాజు అన్నారు. గ్రామానికి చెందిన డి.మల్లమ్మకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.32 వేల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూస్తున్నామన్నారు. రవీందర్, చేగూరి కుమార్, మల్లమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ వలంటీర్లుగా వీఆర్‌ఫర్ యూ ప్రతినిధులు



వలంటీర్లుగా పనిచేస్తున్న వీఆర్‌ఫర్‌యూ ప్రతినిధులు

మణికొండ: ట్రాఫిక్ పోలీసులకు తోడుగా వీఆర్‌ఫర్‌యూ ప్రతినిధులు వలంటీర్లుగా సేవలు అందించారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జాం కారణంగా ప్రజలు గంటల ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసు ఉన్నా పరిస్థితిలో మార్పు రావటం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం వీఆర్‌ఫర్‌యూ సంస్థ ప్రతినిధులు దిలిప్‌కక్కడ్, ప్రదీప్‌రావు, లక్ష్మణ్‌రావు, బాపూజీ ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి విధులు నిర్వహించారు. షేక్‌పేట నుంచి వచ్చే వాహనాలను జెమ్ మోటార్స్ ముందు గండిపేట కాలువ కింద నుంచి ఎడమవైపునకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల దిశగా మళ్లించారు. మర్రిచెట్టు కూడలి నుంచి మణికొండ పాత గ్రామంలోనుంచి వచ్చే వాహనాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌లో ఫ్రీ లెఫ్ట్‌కు పంపారు. దీంతో కొంత మేర ట్రాఫిక్ సమస్య తగ్గింది. మణికొండ గ్రామంలో వన్‌వే పద్ధతిలో ట్రాఫిక్‌ను పంపించాలని వారు సూచించారు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం



హైదరాబాద్‌కు చేరుకున్న ఉమ్రా యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి 25 రోజుల కిందట ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికుల బృందం యాత్రను పూర్తి చేసుకుని మంగళవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. యాత్ర దిగ్విజయం కావడం సంతోషంగా ఉందని నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.

తైక్వాండో విజేతకు అభినందనలు



అబ్దుల్ ఖలీల్‌ను అభినందించిన నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

మణికొండ: మలేషియాలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన అబ్దుల్ ఖలీల్‌ను నార్సింగి నాయకులు, ప్రజలు అభినందించారు. ఈనెల 5 నుంచి జరిగిన పోటీల్లో ఆయన బ్లాక్‌బెల్ట్ 5డన్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. మంగళవారం నార్సింగికి తిరిగి వచ్చిన ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నాయకులు రాము, వినోద్‌కుమార్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలి



తిరుమల గార్డెన్ కాలనీలో మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ పద్మావతి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. 7వ డివిజన్‌లో కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ ఆధ్వర్యంలో తిరుమల గార్డెన్ కాలనీలో మంగళవారం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మొక్కలను ప్రజలు తీసుకోవాలన్నారు. వాటిని ఇంటి పరిసరాలతో పాటు ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపుల నాటడమేగాక వాటి పెంపకం బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, రాజుయాదవ్, వార్డు అధికారి ఇమ్రాన్, కాలనీ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్‌యాదవ్, సెక్రటరీ నాగేందర్, జనరల్ సెక్రటరీ సురేష్, కాలనీ వాసులు వేణు, ధనుంజయ్, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, అంబరీష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

రాజేంద్రనగర్: ఓ మహిళ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌కు తొమ్మిదేళ్ల క్రితం సుధారాణి(30)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. సోమవారం రాత్రి శ్రీకాంత్ ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో సుధారాణి పడి ఉంది. స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అతను సుధారాణి తల్లిదండ్రులతో పాటు బంధువులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం బండ్లగూడ చేరుకున్న సుధారాణి బంధువులు శ్రీకాంత్ ఆమెను హత్య హత్య చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తూ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సుధారాణి గుండెపోటుతో సుధారాణి మృతి చెందిందని డాక్టర్లు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు కేసును విత్‌డ్రా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

రాజేంద్రనగర్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా భార్యభర్తలు ఉపాధ్యాయులుగా పని చేసేవారికి బదిలీల్లో అదనపు 10 పాయింట్లు ఇవ్వడం సరికాదని నాన్–స్పౌస్ ఉపాధ్యాయులు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం శివరాంపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి అదనపు పాయింట్ల వలన నాన్ స్పౌస్ ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఈ నిబంధన తొలగించి అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాన్ స్పౌస్ క్యాగిరీ ఉపాధ్యాయులు నర్సింహాచారి, విక్రంరెడ్డి, అంజయ్య, సుదాకర్, మొగులయ్య, జంగయ్య, పరమేష్, స్నేహలత, వీరమణి, రత్నప్రభ, ఉదయలక్ష్మి, వెంకటయ్య, వీరేషం, వెంకటేష్, రాంమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయశ్రీ, శ్రీదేవి, వాణిశ్రీ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మరమ్మతు పనుల పరిశీలన



బుద్వేల్‌లో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మజ్జిగ నరేష్‌యాదవ్

రాజేంద్రనగర్: వర్షాలకు పాడైన రోడ్లకు మరమ్మతులు నిర్వహించి ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు మజ్జిగ నరేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం బుద్వేల్‌లో చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కురిసిన వర్షాలకు రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహకారంతో పరిష్కరించడం జరిగిందన్నారు. అధికారులతో మాట్లాడి ప్యాచ్ వర్క్ పనులను చేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'మనూ' దూరవిద్య కోర్సులలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వివిధ దూర విద్యా కోర్సులలో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తోందని డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రజావుల్లాఖాన్ మంగళవారం తెలిపారు. దూర విద్యా కోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 25 చివరి తేదీగా అని తెలిపారు. అడ్మిషన్ ఫీజును ఆగస్టు 31 వరకు చెల్లించవచ్చన్నారు. దూర విద్యా కోర్సులలో ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ (ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్ నంబర్లు 040–23008463, 040–23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)ని సంప్రదించాలని కోరారు.

సామాజిక శాస్త్రాల మనుగడకు కొత్త ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

రాయదుర్గం: సామాజిక శాస్త్రాలు ప్రస్తుతం, భవిష్యత్తుతో మనుగడ సాగించాలంటే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఉర్దూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ ఆధ్వర్యంలో రాజనీతి శాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రిఫ్రెషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రం కంటే పాశ్చాత్య తత్వశాస్త్రం గురించి మనకు ఎక్కువ తెలుసన్నారు. పాశ్చాత్య దేశాలపై ఆధారపడిన భారతీయ సామాజిక శాస్త్ర వ్యవస్థకు భారతీయ బోధనా సంప్రదాయాలపై అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

నాలా కన్వర్షన్ సమస్యలు పరిష్కరించాలి

సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను కలిసిన ప్రభుత్వవిప్ గాంధీ, ఎమ్మెల్యే వివేకానంద్, బిల్డర్లు

గచ్చిబౌలి: హెచ్ఎండీఏ పరిధిలోని స్థల యజమానులు, నిర్మాణదారులు రెండేళ్ళుగా నాలా కన్వర్షన్ సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, ఎమ్మెల్యే వివేకానంద, ఎన్ఏఆర్ఈడీసీఓ వెస్ట్‌జోన్ బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, భూపరిపాలనా కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నారెడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్ఎండీఏ పరిధిలో 15 శాతం ఏరియాను తాకట్టు పెట్టుకొని నిర్మాణాలకు బిల్డింగ్ పర్మిషన్ ఇచ్చి నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఏడాది గడిచినా నాలా సమస్యతో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు రాక రెసిడెంట్లు, నిర్మాణదారులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని నిర్మాణాలు పూర్తయి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నాలా సంబంధించిన చార్జీలు తీసుకొని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని పంచాయితీ లేఔట్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యలను, గజాలలో మిగిలిన భూమిలో నాలా కన్వర్షన్‌కు సంబంధించిన విషయాలను పరిష్కరించాలని కోరామన్నారు. ఇందుకు నవీన్ మిట్టల్ సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో నారెడ్కో ప్రతినిధులు ప్రభాకర్‌రావు, కెవిప్రసాద్, రాంకుమార్, సుభాష్, శివచౌదరి, పవన్‌నాయుడు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని రాజీవ్‌నగర్‌బస్తీవాసుల పిలుపుపై ఆయన మంగళవారం బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా డ్రైనేజీ పైప్‌లైన్ డయా పెంచి లెవల్స్‌తో అనుసంధానం చేస్తూ ఒక కాలనీ నుంచి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తలెత్తకుండా వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. మురుగుకాలువల పనులను త్వరలో చేపడుతామని చెప్పారు. నాయకులు శ్రీరాములు, చిన్న, రాజు, మునియప్ప, నర్సింహ, రోజా, సుశీల, కృష్ణ, వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.